ప్రజాశక్తి
బుధవారం 8 జనవరి 2025
5
శ్రీకాకుళం




నేడు జెడ్‌పి బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పరిషత్‌లో 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 సంవత్సర అంచనా బడ్జెట్‌ను ఆమోదించేందుకు జెడ్‌పి నూతన సమావేశ మందిరంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చ సాగనుందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలు ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఆహ్వానం అందిన ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో భాగంగా ఒకటో స్థాయీ సంఘ సమావేశాన్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మళ్లీ వైరస్ గుబులు



కరోనా వైరస్ పేరు వింటే ఇప్పటికీ జనం వణికిపోతారు. నాలుగేళ్ల కిందట కరోనా సృష్టించి విలయం అంతా ఇంతా కాదు. వైరస్ వ్యాప్తి, బాధితుల కష్టాలు, మృత్యువాత ఘటనలను గుర్తు తెచ్చుకుని తుళ్లిపడతారు. 2022 తర్వాత దాని ప్రభావం పూర్తిగా తగ్గిపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు దేశంలో పలుచోట్ల హ్యూమన్ మెటా న్యూమో (హెచ్‌ఎంపివి) పేరుతో కొత్త వైరస్ కేసులు నమోదు కావడంతో అందరిలోనూ ఆందోళన నెలకొంది. కొత్త వైరస్ కేసులు వస్తున్న నేపథ్యంలో కేంద్రం సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేసింది.

- దేశంలో మూడు హెచ్‌ఎంపివి కేసులు నమోదు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రభుత్వం ఆదేశాలు
- సర్వజన ఆస్పత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కొత్త వైరస్ కేసులు వెలుగు చూస్తుండడంతో, జనంలో కొంత ఆందోళన నెలకొంది. వైరస్ సోకిన వారిలో దగ్గు, జలుబు, జ్వరం, ఆయాసం, దురద వంటి లక్షణాలు ఉంటాయి. ఐదేళ్ల లోపు చిన్నారులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులు, హెచ్ఐవి, కేన్సర్ వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారికి, స్టెరాయిడ్స్ వినియోగించే వారికి వైరస్ సోకే అవకాశం ఎక్కువ ఉందని వైద్యులు చెప్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. నోటి తుంపర్ల ద్వారా వైరస్ సోకిన వ్యక్తి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని నిపుణులు చెప్తున్నారు. వీటితోపాటు సన్నిహితంగా మెలగడం, కరచాలనం, స్పర్శ వంటి చర్యల ద్వారా వైరస్ వ్యాపిస్తుందని చెప్తున్నారు. అయితే చాలా మందిలో ఫ్లూ మాదిరిగా వచ్చి తగ్గుతుందని పేర్కొంటున్నారు. బ్రొంకైటిస్, న్యుమోనియా, ఆస్తమా ఉన్న వారిలో తీవ్రత కొంత ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. మాస్క్ ధరించడం, చేతులను శుభ్రం చేసుకోవడం చేస్తుండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెప్తున్నారు.

అప్రమత్తమైన అధికారులు

కొత్త వైరస్ కేసుల నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జిజిహెచ్)లో 20 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తున్నారు. వైరస్ వ్యాప్తి చెందితే అందుకనుగుణంగా పరీక్షలు చేసేందుకు పరీక్షల కిట్లను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. జిజిహెచ్‌లో ఐదు విభాగాల వైద్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఊపిరితిత్తులు, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ మెడిషన్, ఎనస్థీషియన్ మైక్రోబయాలజీ వైద్య నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రతిరోజూ వస్తున్న జర్వం కేసులను నమోదు చేస్తున్నారు. వారం రోజులుగా నమోదైన జ్వరం కేసుల వివరాలను పరిశీలిస్తున్నారు. ఒక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో కేసులు వస్తే, వాటి సమాచారం ఇవ్వాలని జిజిహెచ్ అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. కోవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వైరస్ బారిన పడకుండా ఉండవచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.

అన్నీ సిద్ధం చేస్తున్నాం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 20 పడకలతో వార్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధంగా ఉంచుతున్నాం. పరీక్ష కిట్లు ఉన్నాయి. వైరస్‌పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. శానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకోవాలి. మాస్క్ ధరిస్తే మంచిది.

- టి.బాలమురళీకృష్ణ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

20 పడకలతో వార్డు ఏర్పాటు



వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి జ్వరాలతో వచ్చే వారిని పరిశీలిస్తున్నాం. వారం రోజులుగా తీవ్రంగా జ్వరంతో బాధపడేవారు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశాం. ప్రస్తుతం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- షకీలా, శ్రీకాకుళం జిజిహెచ్ సూపరింటెండెంట్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విజృంభిస్తున్న డయేరియా

- పెరుగుతున్న రోగులు
- ఇప్పటివరకు 11 కేసులు నమోదు
- పరిశుభ్రత లోపమే వ్యాప్తికి కారణం
- నాలుగు రోజుల పాటు చేపలు, మాంసం విక్రయాలపై నిషేధం

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు మండల కేంద్రంలోని కస్పా వీధిలో డయేరియా విజృంభిస్తోంది. వాంతులు, విరేచనాలతో ఇప్పటివరకు 11 మంది ఆస్పత్రుల్లో చేరారు. మంగళవారం ఐదుగురు రోగులు పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేరారు. డయేరియా ప్రబలిన వీధుల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో పంచాయతీ సిబ్బంది ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు, ఫాగింగ్ చేపట్టారు. తాడివలస వైద్యులు రమేష్ నాయుడు, నవీన్ పవన్ కళ్యాణం ఆధ్వర్యాన పిహెచ్‌సి సిబ్బంది రోగులకు ఇంటి వద్ద చికిత్స అందిస్తున్నారు. డయేరియా సోకిన వీధులలో బోరుబావులను నిలిపివేసి, ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎంపిడిఒ మన్మథరావు, సర్పంచ్ ఆర్.లక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు చిగులిపల్లి రామ్మోహన్ పరామర్శించారు.

బాధితులకు డిపిఒ పరామర్శ

డయేరియా సోకిన రోగులను, కుటుంబాలను జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య మంగళవారం పరామర్శించారు. వీధుల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. తాగునీటి వనరుల్లో ఎటువంటి కలుషితం లేదని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రాజు డిపిఒకు తెలిపారు. లేబొరేటరీల్లో నిర్వహించిన నీటి పరీక్షలను డిపిఒకు అందించారు. వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడమే వ్యాధి తీవ్రతకు కారణమని డిపిఒ గుర్తించారు. నాలుగు రోజుల పాటు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని ఇఒ మోహన్‌బాబును ఆమె ఆదేశించారు. వీధుల్లో తిరిగి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యాధి తీవ్రతపై వైద్యులతో చర్చించి, వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్య, పంచాయతీ అధికారులతో చర్చించారు.

చేపలు, మాంసం విక్రయాలపై నిషేధం

డయేరియా వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో నివారణ చర్యల్లో భాగంగా మండల కేంద్రంలో మాంసం, చేపలు విక్రయాలను పంచాయతీ అధికారులు నిషేధించారు. నాలుగు రోజుల పాటు ఎటువంటి విక్రయాలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిపిఒ భారతీ సౌజన్య సూచించారు. త్వరలో సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈలోగా వ్యాధిని పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకు వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. ఆమెతో పాటు డిఎల్‌పిఒ ఐ.వి రమణ, ఎఒ మిశ్రా తదితరులున్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న డిపిఒ భారతీ సౌజన్య

ఎస్‌సి కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎస్‌సి కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఏడో తేదీతో గడువు ముగియనుండడంతో మరో ఐదు రోజులు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఎస్‌ఒపి విధివిధానాలు తెలుపుతూ ప్రభుత్వం 265 నంబరు జిఒ విడుదల చేసినట్లు తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఈనెల 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను ఈనెల 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు.



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : సమస్యలు తెలుసుకునేందుకు నిరంతరం నియోజకవర్గంలో ప్రజలతోనే ఉంటానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తన వద్దకు వచ్చి చెప్పుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలో వ్యక్తిగత, సామాజిక అవసరాలను పరిష్కరించాలంటూ పలువురు వినతులు అందజేశారు. గ్రామాల్లో రోడ్లు, కాలువలు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని గార, శ్రీకాకుళం మండలాల్లోని పలువురు వినతులు అందజేశారు. గళగళ్లవానిపేట వద్ద సముద్ర తీరం కోతకు గురవుతోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మత్స్యకారులు విన్నవించారు.

ఘనంగా రంగోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లాస్థాయి రంగోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకలను జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొన్నారు. ఎనిమిది విభాగాలుగా నిర్వహించిన పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. వ్యాసరచన, చేతిరాత, రంగోలీ, వక్తృత్వపు, ఫోక్ డాన్సులు, డిజిటల్ పోస్టర్స్, రోల్ ప్లే, స్లోగన్ ఇతర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచన విజేతలకు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి, ప్రిన్సిపాల్ ఎ.గౌరీశంకర్, అధ్యాపకులు భారతమ్మ, జి.వి రమణ, ఎ.వేణుగోపాల్, ఎల్.లీలా మోహన్, వై.వి.ఎ నాయుడు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా షాపుల తొలగింపు

అరసవల్లి అధికారుల నిర్వాకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రథసప్తమి వేడుకల పేరిట అరసవల్లి సూర్యనారాయణ స్వామి అధికారుల హడావుడి చిరు వ్యాపారుల పొట్ట కొడుతోంది. ఆలయానికి ఎదురుగా ఉన్న టిటిడి కళ్యాణ మండపానికి ఆనుకుని దేవాదాయ శాఖ కొన్నేళ్ల కింద దాత సహకారంతో దుకాణ సముదాయాలను నిర్మించింది. అందులోనే మేడపై ట్రైమెక్స్ సంస్థ సహకారంతో నిత్యన్నదాన పథకాన్ని, సూర్య నమస్కారాలు నిర్వహించేందుకు హాలు, ప్రసాద విక్రయాలతో పాటు వంటశాల నిర్వహించేవారు. ఆలయానికి ఎదురుగా దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని అద్దె ప్రాతిపదికన వ్యాపారులకు కేటాయించి, నెల వారీ అద్దెను వసూలు చేస్తున్నారు. డిపాజిట్ రూపంలో మొదట్లో కొంత మొత్తాన్ని ఆలయ అధికారులు సేకరించారు. కొన్నేళ్లుగా అక్కడ పలు కుటుంబాలు చిరు వ్యాపారాలు చేసుకుని జీవనాన్ని సాగిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద రూ.వంద కోట్లు ఇస్తుందని ప్రభుత్వ పెద్దలు ప్రకటించగానే, హడావుడిగా ముందున్న భవన సముదాయాన్ని తొలగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. వాటిని తొలగిస్తే విశాలమైన స్థలం ఉంటుందని, ఆపై ఇంద్రపుష్కరిణి, ఆలయ భూముల్లో కట్టడాలు నిరించుకోవచ్చని సూచించారు. అంతవరకు బాగానే ఉన్నా అందులో సుదీర్ఘ కాలంగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యాపారులకు కనీసం ఒక్క మాటైనా చెప్పకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా అధికారులు హడావుడిగా ఖాళీ చేయించి భవనాలను పడగొట్టేశారు. ఆలయంలో జరిగే అతి పెద్ద ఉత్సవం రథసప్తమి. ఈ వేడుకల సమయంలోనే వారికి వ్యాపారాలు సాగుతాయి. ఇటువంటి సమయంలో ప్రత్యామ్నాయం చూపకుండా దుకాణ సముదాయాన్ని కూల్చివేయడంపై వారిలో ఆవేదన వ్యక్తమవుతోంది. చిరు వ్యాపారుల జీవనోపాధి లేకుండా చేశారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రత్యామ్నాయం చూపాలని వ్యాపారులు కోరుతున్నారు.



అరసవల్లిలో కూల్చివేసిన దుకాణ సముదాయం

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, చెడు ఫలితాల గురించి వివరించే వినూత్న కార్యక్రమం సంకల్పం అని రెండో పట్టణ సిఐ పి.ఈశ్వరరావు అన్నారు. విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నగరంలోని చేపల వీధిలో గల ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

వ్యసనాలకు గురైతే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ కోసం ఎన్నో కలలు కంటూ రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించి వ్యయప్రయాసలకోర్చి చదివిస్తున్నారని, వారి కలలు నిజం చేయాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. అందుకోసం క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్ అథ్లెటిక్స్ పోటీలకు 30 మంది ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ : స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యాన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో నిర్వహించిన జిల్లాస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు ఆసక్తిగా సాగాయి. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ మంగళవారం ప్రారంభించారు. రన్నింగ్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, షాట్‌ఫుట్ వంటి ఈవెంట్లల్లో పలు విభాగాల వారీగా పోటీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 60 మంది పారా క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 31 మంది క్రీడాకారులను ఈనెల 30న గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయిలో రాణించిన క్రీడాకారులకు జాతీయ స్థాయి పోటీలకు అర్హత లభిస్తుందని కోచ్ శ్రీధర్ తెలిపారు. ఈ పోటీలను స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ జిల్లా అధ్యక్షులు టి.రాము, కార్యదర్శి ఎన్.గిరిధర్, కోశాధికారి డి.అచ్యుతరావు, సభ్యులు ఎన్.స్రవంతి, ఖేలో ఇండియా కోచ్‌లు శ్రీనివాస్, ఎన్.రాజేష్ పర్యవేక్షించారు.



ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - లావేరు

ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు అధిక ఆదాయం, పోషక విలువలు కూడిన ఉత్పత్తి వస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి అన్నారు. మండలంలోని బెజ్జిపురంలో యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన అమృత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్‌కృష్ణతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తులు అందించాలన్నారు. గ్రామసిరి, గోగు కిరణాలు రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో సభ్యులుగా చేరేందుకు యూత్‌క్లబ్ తరహా అన్ని స్వచ్ఛంద సంస్థలూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి సారవంతం పెరిగి అధిక పంట దిగుబడికి ఉపయోగపడుతుందని తెలిపారు. మండల ఎఒ రమేష్ నాయుడు మాట్లాడుతూ రైతులు అధిక మొత్తంలో క్రిమిసంహారక మందులు వినియోగించడం వల్ల భూమి సారం కోల్పోతుందన్నారు. విషాహార ఉత్పత్తులు ప్రజలకు అందించి వారి అనారోగ్యానికి కారకులవుతున్నామని తెలిపారు. పురుగు మందుల వాడకం తగ్గించాలని సూచించారు. యూత్ క్లబ్ అధ్యక్షులు మేడూరి ప్రసాదరావు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యాన రైతులకు ప్రకృతిసిద్ధమైన కషాయలు, ద్రావణాలు గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాల ద్వారా రైతులకు తక్కువ లాభంతో అందిస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులు పండించిన ఉత్పత్తులు ఎక్కువ మొత్తం చెల్లించి తమ రైతు కంపెనీల ద్వారా కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఇజ్జాడ అప్పారావు, కోశాధికారి గంట్యాడ అప్పలనాయుడు, డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ సిహెచ్.సృజన, సూపర్‌వైజర్ పోలినాయుడు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సారవకోట

మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం శంకుస్థాపన చేశారు. ముందుగా కెసి రోడ్డు నుండి సవరకురిడింగి వరకు రూ.65 లక్షలతో బిటి, హిరమండలం రోడ్డు నుంచి కుర్మన్నపేట వరకు రూ.45 లక్షలతో సిసి, గోవర్ధనపురం నుంచి పురుషోత్తమకర్ర వరకు రూ.70 లక్షలతో, తెంబూరు, హిరమండలం రోడ్డు నుంచి మూగుపురం వరకు రూ.70 లక్షలతో బిటి, సింగవలస నుంచి సవరబెజ్జి వరకు రూ.2 కోట్లతో బిటి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు ధర్మాన తేజ్‌కుమార్, చిన్నాల కూర్మినాయుడు, పంచాయతీరాజ్ డిఇ సత్యంనాయుడు పాల్గొన్నారు.

స్వయంశక్తి సంఘాల సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక మండల మహిళా సమైక్య లోని కార్యవర్గ సభ్యులు, విఓఎలు, సిసిలు పనితీరు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు అన్నారు. మూడంచల వ్యవస్థలు గల సంస్థలు గుడ్ గవర్నెన్స్‌పై రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. మంగళవారం సహకార చట్టం 1995, క్రెడిట్ కార్పొరేషన్ ఫెడరేషన్ 1964 చట్టం ద్వారా పాటించాల్సిన నీయమ నిబంధనలు, స్వయంశక్తి సంఘాలు తమ సొంత అంతర్గత పొదుపులపై ఆధారపడి బ్యాంకు రుణాలకు ప్రాధాన్య ఇవ్వకుండా మైక్రో ఫైనాన్స్ సంస్థల జోలికి వెళ్లకుండా సంఘాలను,



మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

సంస్థలను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలపై అవగాహన కల్పించామన్నారు. అంతర్గత అప్పు, గ్రామ సంఘం ద్వారా సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధి ద్వారా జీవనోపాధి రుణాలు, ఎస్‌సి, ఎస్‌టి ద్వారా ఉన్నతి రుణాలు, వాటిని సక్రమంగా ఉపయోగించి వివరించామన్నారు. 'సూర్యఘర్ పథకం' ద్వారా అన్ని కుటుంబాలు సౌరశక్తితో విద్యుత్ సంబంధించి పరికరాల ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో సిసిలు డి.మోహనరావు, డి.లక్ష్మి, అకౌంటెంట్ పి.మోహిని, ఆపరేటర్ పి.విష్ణుబాబు, డి.పార్వతి పాల్గొన్నారు.

వివేకానందుడు ఆదర్శప్రాయుడు

ప్రజాశక్తి- టెక్కలి

స్వామి వివేకానందుడు యువతకు ఆదర్శప్రాయుడని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో చరిత్ర విభాగం ఆధ్వర్యాన వివేకానంద 162వ జయంతి సందర్భంగా మంగళవారం రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివేకానందుని గొప్పతనం, అతను దేశానికి అందించిన సేవలను ప్రశంసిస్తూ 'భారతదేశ ప్రగతికి యువకులే రథ సారధ్యం' వహించాలని అన్నారు. వివేకానంద భావ ప్రచార పరిషత్ ఉత్తరాంధ్ర కన్వీనర్ సంపతిరావు విశ్వనాథం, రామకృష్ణ మాట్లాడుతూ యువతకు వివేకానందుడు ఆదర్శప్రాయుడని అన్నారు. అనంతరం క్విజ్ పోటీలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. వీటితోపాటు విద్యార్థులకు పుస్తకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో



బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్‌కుమార్, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, రామకృష్ణ, వృక్షశాస్త్ర విభాగాధిపతి డి.వాసుబాబు, చరిత్ర విభాగాధిపతి కోటేశ్వరరావు, అధ్యాపకులు కె.శ్రీనివాసరావు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ వై.వి.సిహెచ్.లీలాపద్మజ, టి.త్రినాథరావు, జగన్నాథ్ బిసాయ్, వి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జెడి త్రినాథరావు

పంటలను నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రబీ ఈ పంటలో రైతులు తమ పంటలను నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ జెడి త్రినాథరావు సూచించారు. మండలంలోని కొండములగాం పంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యం తొందరగా నూర్పు వేసుకొని కొనుగోలు కేంద్రం ద్వారా మిల్లులకు పంపించాలన్నారు. రబీలో మొక్కజొన్నలో చీడ పీడల యాజమాన్యం, సమగ్ర ఎరువులు యాజమాన్యం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అపరాలు పంటలు విస్తీర్ణం పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల ఎఒ డి.విజయ్‌భాస్కర్, రైతులు దన్నాన సత్తిబాబు, గొర్లె సూర్యనారాయణ పాల్గొన్నారు.

10న రంగవల్లుల పోటీ

కవిటి: భారతీయ విద్యా కేంద్రం వారి ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాల ఆధ్వర్యాన ఈ నెల పదిన రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు ఎం.అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పోటీలకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, అయితే ముగ్గులు వేసేందుకు ఎటువంటి యాంత్రిక పరికరాలు వాడకూడదని సూచించారు.

రేపు పాత సామగ్రి వేలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన పాత ఇనుప సామగ్రిని కళాశాల సిపిడిసి అనుమతితో ఈనెల 9న వేలం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. మంగళవారం కళాశాలలో కమిటీ సమావేశం నిర్వహించి పాత ఇనుప సామగ్రిని వేలం వేసేందుకు నిర్ణయించా మన్నారు. ఈ రోజు ఉదయం 11 గంటలకు కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ వద్ద వేలం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. వేలంలో పాల్గొన దలచిన వ్యాపారులు ఆ సమయానికి నిర్ణయించిన ప్రదేశంలో హాజరు కావాలన్నారు. వేలం పాటను కళాశాల సిపిడిసి సభ్యులు, అధ్యాపకుల సమక్షంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

10, 11న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని రావికంటిపేటలో ఈ నెల 10, 11న సంక్రాంతి సంబరాలు సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యం, క్రీడా స్ఫూర్తిని నింపే ఉద్దేశంతో జిల్లాస్థాయి కబడ్డీ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు నగదు అందజేస్తామని అన్నారు. మిగతా వివరాలకు భానుప్రకాష్ 9963539264, రాఘవేంద్రరావు 9640992916 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

11న ఐటిడిఎ ఏర్పాటుకు ధర్నా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాధవరావు

మెళియాపుట్టి: ఐటిడిఎ సాధనకు ఈ నెల 11న మెళియాపుట్టిలో ధర్నా నిర్వహిస్తున్నట్లుగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు తెలిపారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కార్యాలయంలో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా విభజన తర్వాత ఐటిడిఎ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న జిల్లాకు 16 మండలాల్లో ఆదివాసీలు ఉన్నారని అన్నారు. ఆదివాసీలందరికీ భౌగోళికంగా అందుబాటులో ఉండేది సెంటర్ పాయింట్‌గా మెళియాపుట్టి ఉంటుందని తెలిపారు. పాతపట్నం, మందస, కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టితో సహా ఐదు సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయని అన్నారు. మెజారిటీ మండలాలు మెళియాపుట్టికి అందుబాటులో ఉంటాయని తెలిపారు. తక్షణమే ఐటిడిఎ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనతో పాటుగా దీనబంధుపురం సర్పంచ్ సవర వెంకటేశు, ముకుందాపురం సర్పంచ్ సవర భాస్కరరావు, ఆంపురం సర్పంచ్ డి.జమ్మయ్య, మాజీ సర్పంచ్ సవర భైరాగి, గొట్టిపల్లి సర్పంచ్ గొల్ల జనార్ధన్, సవర గణేష్, లక్ష్మణ్, వర్మ, శ్రీను పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను డిపిఎం రేవతి సమక్షంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ప్రకృతి సేద్య పద్ధతుల్లో పండిస్తున్న ఎ-గ్రేడ్ మోడల్, రబీ డ్రై షోయింగ్ పంటలు, ఎటిఎం మోడల్‌లో సాగు చేస్తున్న పంటలు, బెల్లం తయారీ విధానాన్ని పరిశీలించారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు బాగా సాగు చేస్తున్నారని, బెల్లం తయారీ విధానమూ ఆసక్తికరంగా ఉన్నదని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు క్షేత్ర సందర్శనలో ఏం చూశారు... మోడల్స్



పరిశీలిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

విధానంలో పంటలు ఎలా ఉన్నాయన్న తదితర అంశాలపై డిపిఎం రేవతి వ్యవసాయ కళాశాల విద్యార్థులను అడిగి తెలుసుకొని వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానికిరామ్ పాల్గొన్నారు.



సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెల్లంఊటలు ధ్వంసం

సోంపేట : ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో ఇరు రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఎక్సైజ్‌శాఖ, ప్రత్యేక దళాల సిబ్బంది కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 16,600 లీటర్ల నిల్వ ఉంచిన బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.బేబి తెలిఆపరు. ఈ దాడుల్లో ఒడిశా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చెందిన ఉన్నతాధికారులు, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారని అన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు నాటుసారా పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కిడ్నీ వ్యాధితో కళాకారుడు మృతి



అప్పారావు (ఫైల్)

పలాస : మండలంలోని బొడ్డపాడుకు చెందిన కళాకారుడు గేదెల అప్పారావు (62) కిడ్నీ వ్యాధితో మంగళవారం మృతి చెందారు. అప్పారావు ఐదేళ్లగా వ్యాధితో బాధపడుతుండగా, రెండేళ్లగా డయాలసిస్ చేయించుకుం టున్నారు. తన జీవితాన్ని కళారంగానికే అంకితం చేసి ఉద్దాన ప్రాంతంలో బొడ్డపాడులో ఎంతో మంది యువకులను కళారంగం బాట పట్టించారు. ఉద్దానంలో బహుళ ప్రాచుర్యం పొందిన అత్తా, కోడళ్ల, పగటి వేషానికి సరికొత్త బాణీలతో ఎంతో వన్నె తెచ్చారు. అండమాన్, భిలాయ్ లాంటి ఎన్నో ప్రాంతాల్లో కోలాటం, కోయ డాన్స్ ప్రదర్శించడంలో ముఖ్య భూమిక వహించారు. గ్రామ ఉత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు తన సారథ్యంలోనే యువతను సిద్ధం చేసి, ఉద్దానం ప్రాంతంలోనే బొడ్డపాడు కళారంగాన్ని కీర్తి పతాకంలో నిలిపారు. కళాకారుని మృతిపై ఉరసం సభ్యులు కుత్తుం వినోద్ కుమార్, టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, సర్పంచ్ తామడ మదన్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష నాయకులు సంతాపం తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పాథమిక దశలో బాలల్లో వచ్చే కేన్సర్‌ను గుర్తిస్తే వారిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుకోవచ్చని లయన్స్ క్లబ్ హర్షవల్లి సభ్యులు, విశ్రాంత అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ అన్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు కేన్సర్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్య పరిరక్షణలో జాగ్రత్త వహించి తేడాలు వచ్చినప్పుడు గనించి వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. జంక్ ఫుడ్‌కు పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. అమ్మ చేతి వంట అమృత సమానమని పేర్కొన్నారు. బాలలో



మాట్లాడుతున్న హరికాప్రసాద్

వచ్చే కేన్సర్ ప్రాథమిక లక్షణాలు గుర్తించడానికి అనువైన సూత్రాలను వివరించారు. లయన్స్ క్లబ్ హర్షవల్లి అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథ నాయుడు, లయన్స్ ఇంటర్నేషనల్ విద్యా సంక్షేమ చైర్మన్ హరికాప్రసాద్, ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.దేవదత్తానందం, క్లబ్ కార్యదర్శి మణిశర్మ తరళి, ఉపాధ్యక్షుడు తర్లాడ అప్పలనాయుడు డైరెక్టర్లు పార్వతీశ్వరరావు, లక్ష్మీకాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పిండి వంటకాలు

ప్రజాశక్తి- సోంపేట

నేటి తరంతో పాటుగా భావితరాలకు సంక్రాంతి సంస్కృతిని గుర్తు చేస్తూ సోంపేట పట్టణంలోని మహర్షి విద్యానికేతన్ ఆవరణంలో ముందస్తు సంక్రాంతి సంబరాల వేడుకలు మంగళవారం నిర్వహించారు. గాలిపటాల ఎగరవేయడం, రంగవల్లిక పోటీలు, భోగి మంటలు, వివిధ రకాల పండగ వంటకాలను స్టాల్స్‌గా ఏర్పాటు చేశారు. పండగ సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు గుర్తుంచుకునేలా చేశారు. ఈ మేరకు పాఠశాల ఆవరణంలో మూడో నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫుడ్ స్టాల్లో ఫ్రూట్ సలాడ్, నోరూరించే 50 రకాల వంటకాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా సోంపేట, కంచిలి ఎంఇఒలు సప్పటి శివరాం ప్రసాద్, కృష్ణమోహన్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటుగా సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులే స్వయంగా తమ ఇళ్లల్లో పిండి వంటలు తయారు చేసుకొని స్టాల్స్ ఏర్పాటు చేయడం చూడముచ్చటగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఇళ్లల్లో అన్ని పనుల్లో భాగస్వామ్యమై తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటే మంచిదని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బత్తుల కామేశ్వరరావు, భావన శ్రీకాంత్, మాదిన ప్రసాద్, ఫిరియా ధర్మేంద్ర, బల్ల జానకిరావు, రాంబాబు, మోహన్, మహర్షి విద్యానికేతన్ యాజమాన్య సభ్యులు



పిండి వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జి.వి.ఎస్.ఎస్.ప్రసాద్, వి.ఎల్.శకుంతల, ఎ.పి.మురళీమోహన్, వెదుళ్ల తిరుపతిరావు, ప్రధానోపాధ్యాయుడు తరణి ప్రసాద్‌పండా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి కళ్యాణి

47 మందికి నేత్ర వైద్య పరీక్షలు

రణస్థలం: విశాఖపట్నంలోని ఐఎన్ టిఎస్ ఫౌండేషన్‌లో 47 మంది కేన్సర్ రోగులకు రణస్థలం కళ్యాణి పరీక్షా కేంద్రం, శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రణస్థలం కళ్యాణి పరీక్షా కేంద్రం అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి మాట్లాడుతూ 47 మంది కేన్సర్ రోగులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. నలుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వేపగుంటలో ఉన్న శంకర్ ఫౌండేషన్‌కు తరలించామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం

కొత్తూరు: కూటమి ప్రభుత్వం అరకొర ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మెట్టూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి హయాంలో పంట కోత పూర్తయిన వెంటనే వాటిని జియో ట్యాగింగ్ చేసి నేరుగా మిల్లులకు అనుసంధానం చేశారని గుర్తు చేశారు. ఆ వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారని అన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంట కోత పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఆ పని పూర్తి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్న రైతు భరోసా నిధులు వేయకుండా మీనమేషాలు లెక్కిస్తూ... రైతులను దగా చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఓంద్రుజోల ఎంపిటిసి మాజీ సభ్యులు నిమ్మగెడ్డ కృష్ణమూర్తి, నేరడి ఎంపిటిసి ప్రతినిధి బోర ఆఫీస్, మండల కార్యదర్శి మంగి. నరసింహారెడ్డి, క్రిస్టియన్ జిల్లా సంఘం అధ్యక్షులు సొంఠ్యాన తమ్మినాయుడు పాల్గొన్నారు.

షణ్ముఖ టీం ప్రతిభ



బహుమతిని అందుకుంటున్న షణ్ముఖ

కోటబొమ్మాళి: యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా కాకినాడ పిఆర్ కాలేజ్ మైదానంలో 17వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులు షణ్ముఖ మాస్టర్‌కు టీచర్ 2040 ఎడి నాటికకు ప్రథమ బహుమతి, పప్పెట్రీకి ప్రథమ బహుమతి అందజేశారు. జిల్లా నుంచి రాష్ట్ర పోటీలకు కోటబొమ్మాళి మండలానికి చెందిన షణ్ముఖ టీం ప్రథమ బహుమతులు పొందటంపై యుటిఎఫ్ జిల్లా, మండలశాఖ సభ్యులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొండు నారాయణరావు పాల్గొన్నారు.

మండల ఉత్పత్తులకు గుర్తింపు

వజ్రపుకొత్తూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు జిల్లాస్థాయిలో గుర్తింపు లభించిందని వెలుగు ఎపిఎం గొడబ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన సిక్కోలు డ్వాక్రా బజారులో వినియోగదారులను ఉత్పత్తులు ఆకర్షించాయని తెలిపారు. మహిళా సంఘ సభ్యులు తయారు చేసే తీసుకొచ్చిన వస్తువులు అమ్ముడుపోయాయని అన్నారు. ఈ ప్రదర్శనలో నువ్వులరేవుకు చెందిన ఎండు చేపలు, నెత్తళ్లు, స్కూల్ బేగ్స్, అనంతగిరికి చెందిన వేరుశనగ ఆయిల్ బాటిళ్లు, పూండికి చెందిన పేపర్ ప్లేట్స్ ప్రదర్శనలో ఉంచామన్నారు. ప్రదర్శనలో రేణుక, హరిప్రియ, నీలవేణి, వెంకటరావు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు

కవిటి: ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేపడుతోందని, డబ్బులు కూడా వెనువెంటనే రైతుల ఖాతాల్లో జమ అవుతుందని మండల ఎఒ బడగల దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని లొల్లపుట్టుగ, బెజ్జిపుట్టుగ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు ఇబ్బంది పడిన రైతులు అధైర్య పడొద్దని, చివరి గింజ వరకూ కొనుగోలు చేపడతామని తెలిపారు. అనంతరం రబీ పంటలో వరి, రాగి నారుమూడులను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. కవిటి పిఎసిఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పవన్ కుమార్, అమూల్య, రైతులు లొల్ల శ్రీనివాస్, ఎన్ని రాంబాబు, లొల్ల కింగ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

కంచిలి : మండలంలోని అరవసరియాపల్లి సమీపంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 8.20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఎస్‌డిటి కూర్మారావు తెలిపారు. విజిలెన్స్ ఎస్ఐ డివివి సతీష్ కుమార్ ఆధ్వర్యాన సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా, 19 సిమెంట్ సంచుల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడు బి.అప్పన్నను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని, బియ్యాన్ని పౌరసరఫరాల గొడౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న రామ్మోహనరావు

ఆమదాలవలస : జనసేన నాయకులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు కోరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జనసేన పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సంఘాల ఏర్పాటు కోసం జనసేన ముఖ్యనాయకులతో ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వంలో గ్రామస్థాయి నుంచి ఉన్న జనసేన శ్రేణులకు నామినేటెడ్ పదవుల పంపకంలో తగిన గౌరవం దక్కేలా చూడాలని విన్నవించారు.



పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పారదర్శకంగా అభ్యర్థుల ఎంపిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ మైదానంలో నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం 232 అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం హాజరు కావాల్సిన అభ్యర్థులు 11న మాజరుకావాలని అన్నారు. ధ్రువపత్రాలు, ఫిజికల్, ఎత్తు, ఛాతి కొలిశారు. కార్యక్రమంలో డిఎస్‌పి వివేకానంద, అప్పారావు, మూర్తి, రాంబాబు ప్రసాదరావు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై ఫిర్యాదు

సోంపేట : మండల సమావేశానికి గైర్హాజరైన వివిధ శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపిపి నిమ్మన దాసు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సమావేశానికి పలుశాఖలకు చెందిన అధికారులు గైర్హాజరుపై స్పందించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే చాలా గ్రామాల్లో పైపులైన్ల పనులు పూర్తి కాలేదని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పలాసపురం సర్పంచ్ జోగారావు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ సిబ్బందికి పంచాయతీ నిధుల నుంచి వేతనాలు ఇస్తున్నామని, వేరే నిధులు మంజూరు చేయాలని కోరారు. డాక్టర్ వందిత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



సన్మానిస్తున్న నాయకులు

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని దల్లిపేట సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన కార్యదర్శి కూన లక్ష్మునాయుడు, విఆర్‌ఒ కె.సత్యసాయిలకు మంగళవారం సర్పంచ్ కంబాపు నీలవేణి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడుతూ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బడే రఘురాంరెడ్డి, ఎంపిటిసి మాజీ సభ్యులు కంబాపు సూర్యారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రంగోత్సవ పోటీల్లో బహుమతుల పంట

ప్రజాశక్తి- రణస్థలం

సంక్రాంతి సంబరాలను పునస్కరించుకొని రంగోత్సవ కార్యక్రమం పోటీలు శ్రీకాకుళం బాలికల పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో రణస్థలం ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు రికార్డుస్థాయి బహుమతులు కైవసం చేసుకున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వై.పద్మజ, పి..మహాలక్ష్మి రంగళిలో ప్రథమస్థానం, డిజిటల్



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

పోస్టర్ మేకింగ్‌లో జస్వంత్ సాయికు ద్వితీయ బహుమతి, హ్యాండ్ రైటింగ్‌లో పదో తరగతి విద్యార్థిని జి. ఝాన్సీకి తృతీయ బహుమతి, ఫోక్ డాన్స్‌లో 7వ తరగతి విద్యార్థులు దున్న సుమన్, పి.మేఘనప్రియ, డి.ప్రత్యుష, వై.జాహ్నవిలు తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి గైడ్ టీచరుగా ఉదయకుమారి వెళ్లారు. విజేతలకు ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ పి.కృష్ణ, తెలుగు విభాగం టి.ప్రసాద్ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం


ప్రజాశక్తి- రణస్థలం రూరల్

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. రణస్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్ పాఠశాలల జోనల్ గ్రిక్స్ 77వ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రతిఒక్కరూ క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. ఈ తరహా క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల ప్రాంతాల మధ్య సత్సంబంధాలు నిలుస్తాయని అన్నారు. విద్యార్థుల మధ్య స్నేహ బంధాలు పెరుగుతాయని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో మనమంతా భాగస్వామ్యమవుదామని, ఆ దిశగా ముందుకు సాగుదామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, జెడ్‌పిటిసి మాజీ



ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సభ్యులు గొర్లె లక్ష్మణరావు, కూటమి నాయకులు ఎన్.శ్రీనివాసరావు, దన్నాన చిరంజీవి, ఎం.అనంత్, విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, హెచ్‌ఎం బి.రమణయ్య, డి.రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

'అపుస్మా' ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అపుస్మా అభ్యర్థిగా విశాఖపట్నానికి చెందిన ఎస్.శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారని, ఆయనకు మద్దతునివ్వాలని పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి కోరారు. నగరంలోని ప్రయివేటు హోటల్‌లో ప్రయివేటు స్కూళ్ల యజమాన్యాలతో, ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రయివేటు విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు సమిష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు తులసీవిష్ణు ప్రసాద్, చీఫ్ మెంటర్ కృష్ణారెడ్డి, అపుస్మా శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నాయకులు బి.లక్ష్మణరావు, మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అప్పలాచార్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

సందడిగా వారపు సంత

బూర్జ : సంక్రాంతి సందర్భంగా మండలంలోని మంగళవారం నిర్వహించిన కొల్లివలస కొనుగోలుదారులతో సంత సందడిగా మాడింది. సంతలో నూతన వస్త్రాలు, మట్టి కుండలు, నాటు కోళ్ళు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. గ్రామీణ ప్రాంత వాసులకు వారపు సంతే సూపర్‌మార్కెట్‌ని, కొనుగోలు చేస్తేనే తమకు సంతృప్తిగా ఉంటుందని కొనుగోలుదారులు తెలిపారు.



గొర్రెలను విక్రయిస్తున్న వ్యాపారులు